ఘనంగా ఐఎన్‌టియూసి నేత సంజీవ రెడ్డి జన్మ దిన వేడుకలు

విశాలాంధ్ర-పెదగంట్యాడ : ఐఎన్‌టియూసి జాతీయ అధ్యక్షులు జి. సంజీవ రెడ్డి జన్మ దిన వేడుకలు రాయ్ పూర్ లో ఐ.ఎన్ టి యూ సి జాతీయ ,రాష్ట్ర నేతలు, కార్యకర్తలు ,అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు కర్మాగారం నుండి సుమారు 15 మంది ఐఎన్‌టియూసి నాయకులు పాల్గొని సంజీవ రెడ్డి జన్మ దినం సందర్భంగా కేక్ కట్ చేసి సంజీవ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఐ.ఎన్ టి యూ సి జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ సంజీవ రెడ్డి ఐఎన్‌టియూసి కి జాతీయ అధ్యక్షునిగా అంటూ కార్మికుల పక్షాన ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. కార్మిక హక్కుల తో పాటు ఆర్థిక ప్రయోజనాలు సాధించడంలో ఆయన చేసిన కృషి అమోఘమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియూసి నాయకులు గొందేశి మహేశ్వర్ రెడ్డి, మద్ది అప్పలరాజు, వై.వి.రమణ, సి.హెచ్ .సుదర్శనం, కె.శ్రీనివాస రాజు, పెద్దాడ నాగేశ్వర్ రావు, వై.నాగేశ్వర్ రావు, మధు, కిలా నీ ముసలయ్య పాల్గొన్నారు.

ఏయూ వీసీ గా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఐఐటి ఖర్గపూర్ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ఆచార్య జి.పి రాజశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏ.యూ వీసీ నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆచార్య రాజశేఖర్ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా మూడు సంవత్సరాల కాలం కొనసాగుతారని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆచార్య రాజశేఖర్ పదవ తరగతి సెయింట్ ఆంటోనీ హై స్కూల్ విశాఖపట్నం నుంచి, ఇంటర్ (మ్యాథమెటిక్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీ) సబ్జెక్టులతో, మిస్సెస్ ఏవీఎన్ కళాశాల విశాఖపట్నం నుంచి, బీఎస్సీ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) సబ్జెక్టులతో మిస్సెస్ ఏవీఎన్ కళాశాల నుంచి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం ఎమ్మెస్సీ అప్లైడ్ మ్యాథమెటిక్స్ ను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించారు. 1993లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి ఎం ఫిల్ అప్లైడ్ మ్యాథమెటిక్స్ లో ప్రథమ శ్రేణిలో సాధించారు. 1997లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి మ్యాథమెటిక్స్ లో పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. ఆచార్య రాజశేఖర్ 27 సంవత్సరాల బోధన,పరిశోధన అనుభవం కలిగి ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఐఐటి ఖర్గపూర్ ప్రొఫెసర్ గా సేవలు అందిస్తున్నారు. 1998 సంవత్సరంలో టోక్యో యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ టెక్నాలజీ (జపాన్) డిపార్ట్మెంట్ ఆఫ్ అప్లైడ్ ఫిజిక్స్ లో జె.ఎస్.పి.ఎస్ పోస్ట్ డాక్టర్ ఫెలోగా పనిచేశారు. 2002 సంవత్సరంలో ఐఐటి ఖర్గపూర్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఆయన విధుల్లో చేరారు. 2007లో ఆయన అసోసియేట్ ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. 2019 సంవత్సరంలో ఆయన ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. ఆయన వద్ద ఇప్పటివరకు 14 మంది డాక్టరేట్ డిగ్రీలను అందుకున్నారు. మరొక నలుగురు ఆచార్య రాజశేఖర్ పర్యవేక్షణలో ప్రస్తుతం పీహెచ్డీ పూర్తి చేస్తున్నారు. ఆచార్య రాజ శేఖర్ ఇప్పటివరకు ఆరు పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించారు. 112 రీసెర్చ్ పబ్లికేషన్స్ ను వివిధ అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురించారు. ఆచార్య రాజశేఖర్ పలు పురస్కారాలు పొందారు. ఐఐటి ఖర్గపూర్ లో ఆచార్య రాజశేఖర్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ గా, ఐఐటి ఖర్గపూర్ ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ విభాగం డీన్ గా, కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ డీన్ గా, టెక్నాలజీ విజన్ 2047 వర్క్ షాప్ చైర్మన్ గా, ఐఐటి ఖర్గపూర్ విజన్ 2030 డాక్యుమెంట్ కమిటీ చైర్మన్ గా, కెరీర్ డెవలప్మెంట్ సెంటర్ చైర్మన్ గా సేవలందించారు. అదేవిధంగా వీటితోపాటు మరిన్ని పరిపాలన సంబంధిత పదవులను ఆచార్య రాజశేఖర్ సమర్థవంతంగా నిర్వహించారు.

లాభదాయక సాగు విధానంపై రైతుల్లో అవగాహన తీసుకురావాలి

కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : లాభదాయక సాగు విధానాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, తద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్ పై కలెక్టరేట్ మీటింగు హాలులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పలు అంశాలపై వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయం, డీఆర్డీఏ, సాగునీటి పారుదల శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ ను దృష్టిలో పెట్టుకొని రైతు వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని, స్థానిక అవకాశాలను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రకృతి సేద్యానికి, మిల్లెట్లు, బహుళ పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ దిశగా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్దా కంపోస్ట్ పిట్ ఏర్పాటు, కిచెన్ గార్డెన్ల పెంపకం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్ సీజన్ లో ప్రకృతి సేద్యం ద్వారా సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రత్యేక గ్రూప్ లను ఏర్పాటు చేయాలని, వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సమూహాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి మోహన్ రావు, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, సాగునీటి పారుదల శాఖ అధికారులు, ఇతర అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి : అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ పుట్టినరోజు వేడుకలను బిజెపి నాయకులు కార్యకర్తలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. 95వ వార్డు సుజాతనగర్ సమీప రత్నగిరి నగర్ లో గల ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో బిజెపి నేత, స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆకార్ బాలికలతో కలిసి కార్పొరేటర్ కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. అనంతరం సంరక్షణ కేంద్రంలో ఉన్న పిల్లలకు అల్పాహారం వడ్డించి, కార్పొరేటర్ కూడా పిల్లలతో కలిసి అల్పాహారం తిన్నారు. అలాగే పురుషోత్తపురంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి సన్నిధిలో సీఎం రమేష్ పేరిట గోత్రనామాలతో ప్రత్యేక అభిషేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎంపీ సీఎం రమేష్ నాయకత్వంలో అనకాపల్లి జిల్లా అన్నివిధాల అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు, మార్గదర్శకంగా నిలుస్తూ ప్రజాసేవపరంగా సీఎం రమేష్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు, కలగాలని ఆంజనేయస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో (చినముషీడివాడ మండలం)బిజెపి 95, 97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్, బీజేవైఎం విశాఖజిల్లా ఉపాధ్యక్షులు బొడ్డు గురునాథ్, బిజెపి నాయకులు ప్రసాద్, బొబ్బర నాగరాజు, కంచిబోయిన వెంకట సంతోష్, రాపర్తి దుర్గాప్రసాద్, సుంకరి విజయ శేఖర్, తవిటి నాయుడు, గోవిందరావు, కృష్ణమూర్తి, రమణమూర్తి, సత్యనారాయణ, గౌరీ కుమారి, కెవిఆర్ లక్ష్మి, కండిబోయిన మాధవి, చిట్టి భవాని, పవన్ తదితరులు పాల్గొన్నారు

పంచముఖ ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు

విశాలాంధ్ర-మధురవాడ: చంద్రం పాలెం జాతరగట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో క్షేత్ర పాలకుడుగా ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి శ్రీ క్రోధి నామ సంవత్సరం మాఘ మాసం కృష్ణ పక్షం షష్ఠి మంగళవారం సందర్భంగా నిత్య అర్చనలతో ప్రారంభించి, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి అనంతరం పూల మాలలు, తమల ఆకుల మాలలు, వడ మాలలు తదితర సామాగ్రితో అలంకరణ, అనంతరం నాగవల్లి ధళార్చన, సింధూరార్చన మొదలగు పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, హరిస్వామి తదితరులు జరిపించి, నీరాజన మంత్రపుష్పం స్వామి వారికి సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజా కార్యక్రమంలో శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, కమిటీ సభ్యులు పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, కేశనకుర్తి అప్పారావు, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా సత్యన్నారాయణ, ముఖ్య సభ్యులు పిళ్లా అప్పన్న, యం.వెంకటరావు, దుక్క అప్పారావు, పి.రాంబాబు, అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర-పెందుర్తి: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పంపిణీ చేశారు. పెందుర్తి గ్రామానికి చెందిన దొడ్డి ధనేశ్ రామ్ అనారోగ్య సమస్య కారణంగా వినికిడి కోల్పోవడంతో పరికరాలు అమర్చుట కొరకు 4 లక్షల 39 వేల 740 రూపాయల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎమ్మెల్యే మంజూరు చేయించారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాన్ని, మంగళవారం ఉదయం సుజాతనగర్ జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పంచకర్ల అందజేసారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆర్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవ రథసారథి ఆచార్య రాజశేఖర్

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల రథసారథిగా ఆచార్య జి.పి రాజశేఖర్ చరిత్రలో నిలవనున్నారు. 100 ఏళ్ల పండుగను జరుపుకోనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా ఆయన నియమితులయ్యారు. 2025 ఏప్రిల్ 26న ఆంధ్ర విశ్వవిద్యాలయం 99 సంవత్సరాలను పూర్తి చేసుకోనుంది. ఏడాది కాలం శతా బ్ది సంవత్సరం కొనసాగుతుంది. ఏడాది పొడవున విభిన్న కార్యక్రమాలను నిర్వహించి 2026 ఏప్రిల్ నెలలో శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో శతాబ్ది వేడుకలను జరుపుకోనున్న తొలి విశ్వవిద్యాలయం ఆంధ్ర విశ్వవిద్యాలయం. ఇటువంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన వర్సిటీకి ఉపకులపతి గా ఆచార్య రాజశేఖర్ నియామకం అయ్యారు. తెలుగు వ్యక్తి విశాఖ నగరం, ఆంధ్ర విశ్వవిద్యాలయం గురించి సంపూర్ణ అవగాహన కలిగిన విశాఖవాసి ఏయుకు ఉపగలపతిగా రావడం పట్ల ఆచార్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: ఎన్నికలకు సంబంధించిన విధుల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చాకచక్యంగా వ్యవహరించాలని పీవో, ఏపీవో, సెక్టోరల్ అధికారులనుద్దేశించి రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పీవోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులకు కలెక్టరేట్ మీటింగు హాలులో మంగళవారం నిర్వహించిన తొలి విడత శిక్షణా కార్యక్రమంలో ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధులను ఎన్నిసార్లు నిర్వహించినప్పటికీ, ఏమాత్రం అలసత్వం చూపించకూడదన్నారు. ఎప్పటికప్పుడు నిబంధనలు మారుతూ ఉంటాయని, కొత్త ఆదేశాలు వస్తుంటాయని, వాటన్నిటినీ చదివి అర్థం చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఏవిధంగా ఉంటే ఆ విధంగానే ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని, సొంత నిర్ణయాలు పనికిరావని స్పష్టం చేశారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగే ఎన్నికలకు, ఈవీఎంల ద్వారా జరిగే ఎన్నికలకు మధ్య కొన్ని తేడాలు ఉంటాయని, వాటిని ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి తీసుకొనే దగ్గర నుంచి, ఓటింగ్ పూర్తిచేసి తిరిగి అప్పగించే వరకూ పాటించాల్సిన నిబంధనలు, నింపాల్సిన పత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అధికారులంతరూ తు.చ. పాటించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సుధాసాగర్ లు పీవో, ఏపీవో, సెక్టోరల్ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తరువాత చేయాల్సిన విధులను పీపీటీ ద్వారా వివరించారు. ఎన్నికల సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాలను పరిశీలించిన జే ఈ వెంకటేశ్వరమ్మ

విశాలాంధ్ర- నాత వరం : మండలంలోని నిర్మాణంలో ఉన్న పలు రోడ్లను మంగళవారం పంచా యతీరాజ్ జే .ఈ. వెంకటేశ్వరమ్మ పరిశీ లించారు. ఆమె మాట్లాడుతూ మాస య్యపేట నుండి తూర్పుగోదావరి సరిహద్దు కాకరపల్లి వరకు 2.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరుగుతుంది. అది ప్రస్తుతం గ్రాండ్యులర్స్ సబ్ బేస్ లో ఉన్నది అని, నాణ్యతతో కూడిన పనులు చేస్తున్నారని అన్నారు. మార్చి నెల చివరికి ఈ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ఆమె వెంట కాంట్రాక్టర్లు మణి కృష్ణ, దేవా ఉన్నారు.

బల్క్ ఇండస్ట్రీ వినియోగదారులకు తాగునీటికి అంతరాయం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: కృష్ణాపురం హెడ్ వాటర్ పంపు హౌస్ నుండి వచ్చు ప్రధాన తాటిపూడి పైపులైను గోపాలపట్నం వద్ద మరమ్మతులు చేపడుతున్న కారణంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని గోపాలపట్నం నుండి కంచరపాలెం మధ్య ఉన్న బల్క్ ఇండస్ట్రీ వినియోగ దారులకు గురువారం తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జివిఎంసి మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు బి.మురళీకృష్ణ పత్రికా ప్రకటన ద్వారా మంగళవారం తెలియజేశారు. కృష్ణాపురం హెడ్ వాటర్ పంప్ హౌస్ నుండి వచ్చు తాటిపూడి ప్రధాన పైపులైను గోపాలపట్నం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మరమ్మతులకు గురైనందున ఫిబ్రవరి 19 బుధవారం ఉదయం 10 గంటల నుండి ఫిబ్రవరి 20 గురువారం ఉదయం 10 గంటల వరకు మంచినీటి సరఫరా గోపాలపట్నం నుండి కంచరపాలెం వరకు మధ్య ఉన్న బల్క్ ఇండస్ట్రీ వినియోగదారులకు మంచినీటి సరఫరా పూర్తిగా నిలిపివేయడం జరుగుతుందని కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు. కావున తాగునీటి సరఫరాకు కలుగు అంతరాయానికి చింతిస్తూ జివిఎంసి మంచినీటి సరఫరా విభాగం వారికి సహకరించవలసినదిగా జీవీఎంసీ కమిషనర్ తరఫున కోరడమైనదని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు.

ఏ.యు నూతన వైస్ ఛాన్సలర్ గా సింహాచలవాసి

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ సింహాచలం గ్రామం ముద్దుబిడ్డ డాక్టర్ గంగ వంశం పైడి రాజశేఖర్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా నియమించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కు, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ కు సింహా చలం గ్రామం నుండి పాసర్ల ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా ప్రొఫెసర్ జీ పీ రాజశేఖర్ ను నియమిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉత్తర్వులు జారీ చేసారు. ప్రస్తుతం ఐఐటి ఖరగ్ పూర్ లో గణిత శాస్త్ర ఆచార్యునిగా పనిచేస్తున్న ఆయన మూడు సంవత్సరాల పాటు ఆంధ్రా యూనివర్సిటీ వీసీ గా కొనసాగనున్నారు.

నేటి నుండి శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర-విశాఖ సిటీ : పూర్ణా మార్కెట్ సమీపంలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు 19 నుండి 27వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.శేఖర్ బాబు తెలియజేశారు. బుధవారం ఉదయం 10.15గంటలకు శ్రీ అమ్మవారి రాట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 20న నాగవల్లి దళార్చన, తమలపాకులతో అమ్మవారిని అలంకరిస్తామన్నారు. 21న శాకంబరి అలంకారం,22 పుష్పాలంకరణ, 23న సౌభాగ్య లక్ష్మి అలంకారం, గాజులతో శ్రీ అమ్మవారిని ముస్తాబు చేస్తామన్నారు. 24న సాయంత్రం నాలుగు గంటలకు దేవస్థానం ఆవరణలో దీపాలంకరణ జరుగుతుందన్నారు. 25న తొలేళ్ళ మహోత్సవం, 26నమహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తామని, ఉదయం ఐదు నుండి కుంకుమార్చనలు, శూలాల పండుగ, అగ్ని గుండాలు తొక్కుట ఉంటాయన్నారు. రాత్రి 12 గంటలకు శ్రీ అమ్మవారి నేత్రోత్సవం, తొలి పూజ అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. 27న శ్రీ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని, తెల్లవారుజామున 3 నుండి శ్రీ అమ్మవారి దర్శనాలు, భక్తులు ఘటాలతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొన్నారు. వచ్చే నెల 6న మారువారం పండగ జరుగుతుందని, 108 రకాల వంటకాలతో అష్టోత్తర శతపదార్థ నివేదన ఉంటుందన్నారు. అదే రోజున 5వేల మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు శ్రీ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ అమ్మవారి కృపకు ప్రీతి పాత్రులు కావాలని శేఖర్ బాబు కోరారు. కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బీచ్ రోడ్ లో ఘోర ప్రమాదం తప్పిన ముప్పు....

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : బీచ్ రోడ్ నోవోటల్ హెూటల్ సమీపం లో ఇసుక లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో డివైడర్ ను ఢీ కొట్టి, చిల్డ్రన్ పార్కులోకి దూసుకొచ్చిన లారీ లారీ డ్రైవర్ తో పాటు ఒకరికి గాయాలు ఆసుపత్రికి తరలింపు ఆ సమయంలో వాకర్స్ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిత్యం నవటల్ డౌన్ రహదారిలో ప్రమాదాలు సంభవించడంతో బీచ్ సందర్శకులు ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం 6-50 గంటలకు ఇసుక లారి ఏపీ 39టీ 6558 గల లారీ ఇసుక లోడ్ తో శ్రీకాకుళం నుండి ఫిషింగ్ వెళ్ళాలి. కాని ఉదయం బీచ్ రోడ్ లో వాకర్స్ ఉన్న సందర్భంగా రోడ్డు బ్లాక్ చేయ చేశారు. వెంటనే రూట్ మార్చిన లారీ డ్రైవర్ ఫిషింగ్ హార్బోరు కు వయా నోవోటల్ డౌన్ దగ్గర అని అదుపుతప్పి ఇసుక లోడు లారీ నోవోటల్ డౌన్ లో ఉన్న చిల్డ్రన్స్ పార్క్ లోకి దూసుకుపోయింది. అక్కడ ఉన్న పాదచారులకు ఒక వ్యక్తికి చిన్నచిన్న గాయా లయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కొరకై కేజీహెచ్ కు తీసుకు వెళ్లారు వెంటనే సంఘటన స్థలానికి ఎం.ఆర్ పేట పోలీసులు చేరుకున్నారు. ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసిన ఎం ఆర్ పేట పోలీసులు.

టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అక్కయ్యపాలెం ఎన్జీజీఓఎస్ కాలనీలో విష్ణు విల్లా అపార్ట్మెంట్‌లో నివసిస్తున్న టెన్త్ క్లాస్ విద్యార్థిని కే. సాస అనుమానాస్పద పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడింది. సీతమ్మధారలోని ప్రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న ఈ బాలిక ఏమి జరిగిందనేది స్పష్టంగా తెలియరాలేదు. కుటుంబ సభ్యులు గమనించి హాస్పిటల్‌కు తరలించేందుకు ప్రయత్నించినా, మార్గమధ్యంలోనే మృతి చెందింది. సమాచారం అందుకున్న నాలుగో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక ఆత్మహత్యకు గల కారణాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

సెల్‌ఫోన్లు , బంగారం రూ. 92 లక్షలు విలువ చేసే సామాగ్రి భారీ రికవరీ

సీపీ శంఖ బ్రాతబాగ్చి...

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జనవరి నెల రికవరీ మేళా వివరాలు వెల్లడించారు. సీపీ శంఖ బ్రాత బాగ్చి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రూ 92 లక్షలు విలువ చేసే బంగారం సెల్ ఫోన్ లు వివిధ రకాల వస్తువులను రికవరీ చేసామని తెలియజేశారు. జనవరి నెలలో 106 చోరీ కేసులు నమో దయ్యాయని, వాటిలో 66 కేసులను చేదించాం అన్నారు. ఈ 66 కేసులలో 74 నిందితులను అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి 47 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని, జనవరి నెలలో 45 లక్షల విలువైన 300 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతినెల రికవరీ పెరుగుతూ వస్తుంది కేసులను చేదించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ కేసులో ఇప్పటి వరకు 12 మందిని అరెస్ట్ చేసాం. క్రికెట్ బెట్టింగ్ లో మోసపోయిన వారు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలి ఐపీఎల్ మ్యాచ్ లు నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్ జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో నిఘా పెంచాము క్రికెట్ బెట్టింగ్ వలన ఎవరు నష్టపో కూడదన్నారు. బీచ్ రోడ్డులో లారీ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్ గా గుర్తించామని, భవిష్యత్ లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం అన్నారు.

సిపిఐ చొరవ తో టిడ్‌కో నివాసితులకు తాగు నీరు

విశాలాంధ్ర-పెదగంట్యాడ: పెదగంట్యాడ టిడ్ కో ఇళ్ల లో నివాసం ఉంటున్న నివా సితులకు త్రాగు నీరు సరఫరా అయ్యింది . సిపిఐ గాజువాక నియోజక వర్గ కమిటీ పలు దఫాలుగా జీ వి ఎం సి కమిషనర్ , నీటి సరఫరా అధికారులతో చర్చించిన మీదట మంగళ వారం త్రాగు నీరు సమస్య పరిష్కార మయ్యింది . దీంతో టిడ్‌కో గృహాలకు చెందిన నివాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసి రెడ్డి సత్యనారాయణ, నాయకులు జి. ఆనంద్, టిడ్ కో నివాసితులు అప్పల రాజు, సత్యనారాయణ, భాస్కర్ రావు, నాగేశ్వర్ రావు, రమణి, భేగం పాల్గొన్నారు.

ఉక్కుపోరాట మృతులకు నివాళి

విశాలాంధ్ర-పెదగంట్యాడ : విశాఖ ఉక్కు కర్మాగారం కోసం పోరాడి అమరులైన మృతులకు స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఘన నివాళులు అర్పించింది. ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద ఉన్న అమరుల స్మారక క్యాండిల్స్ వద్ద పోరాట కమిటీ నాయకులు పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. విశాఖ ఉక్కు కర్మాగారం నేడు 43 వ ఆవిర్భావ దినోత్సవం నేడు జరుపుకుంటున్నది . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ఆర్ ఐ ఎన్ ఎల్ గా ఆవిర్భవించి నేడు 43 వ వేడుకలను జరుపుకుంటున్న దని అన్నారు. ప్రతి ఏడాది ఉక్కు యాజమాన్యం ఈ వేడుకలను ఎంతో ఉత్సాహ వాతావరణం లో జరుపుకోవడం ఆనవాయితీ , ఐతే ఈ ఏడాది ఈ వేడుకలను నిర్వహించకపోవడం భాధా కర మన్నా రు . స్టీల్ ఏఐటియూసి అధ్యక్షులు కె.ఎస్ ఎన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ , కన్వీనర్ జె. అయోధ్య రామ్, నాయకులు వై.టి దాస్ , యూ .రామస్వామి , పి.వి రమణ మూర్తి, జి.వి సుబ్బయ్య , బి.ఎస్ రెడ్డి ,కారు నాయుడు, నదు పూరు వెంకన్న , వర సాల శ్రీనివాస్ రావు, విల్లా రామ్మోహన్ కుమార్, జి. ఆనంద్ , బి.ఎం ఎల్ నాయుడు, టి.ఎస్ ఎన్ , ఓ బి సీ నాయకులు బి. అప్పారావు తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణ శిబిరాలకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలోని 6 వేదికలలో 517 మంది అభ్యర్థులు పాల్గొనగా "అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం (బహుళ వేదికలు)" కోసం ఎస్ ఎం ఎఫ్ జి ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించింది. కంపెనీ 7వ ఎడిషన్ పశు వికాస్ డే లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన అతిపెద్ద ఒకరోజు పశువుల సంరక్షణ శిబిరాలు ద్వారా ఈ మైలురాయిని సాధించారు. ఈ శిబిరాలు 16 రాష్ట్రాలలోని 500 ప్రదేశాలలో ఏకకాలంలో నిర్వహించబడ్డాయి, దీనిద్వారా దాదాపు 1,90,000 మంది లబ్ధిదారులు (1,50,000 పశువులు మరియు 40,000 పశువుల యజమానులు) ప్రయోజనం పొందారు. ఎస్ ఎం ఎఫ్ జీ ఇండియా క్రెడిట్ 7వ ఎడిషన్ పశు వికాస్ దినోత్సవాన్ని "మేరా పశు మేరా పరివార్" అనే నేపథ్యంతో జరుపుకుందని నిర్వాహకులు చెప్పారు.

దస్తావేజు పోయినది

నా క్లయింటు మరడాన వెంకటరవి S/o మారడాన సూర్యనారాయణ ఇచ్చిన బోగట్టా ప్రకారము మరడాన వెంకట రవి, పూడి కన్నంనాయుడు మరియు సంచాన సంతోష్ కుమార్ జన ముగ్గురకు క్రయ దస్తావేజు నెం. 2887/2022 రులుగా భీమిలి సు॥బు॥రి ఆఫీసులో శ్రీమతి పాము కవిత గారిచే రిజిష్టరు కాబడిన ఆస్తి కలదు. సదరు ఆస్తి యొక్క లింకు దస్తావేజు నెం. 1176/1991 మరియు 1937/1986 గల దస్తావేజులు తే:22-01-2025 దీన మధురవాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్దకు వెళ్ళి అక్కడ వున్న జెరాక్స్ షాపులో జెరాక్స్ తీయించి కొమ్మాది జంక్షన్ వద్ద గల పెట్రోల్ బంక్ వద్ద చూసుకోగా మార్గమధ్యలో పై ఒరిజినల్ లింక్ దస్తావేజులు పోయినవి. పై దస్తావేజులు దొరికిన యెడల ప్లాటు నెం. 401, సాయి ఖ్యాతి ఎన్‌క్లేవ్, షిరిడి సాయినగర్, విజయనగరం జిల్లా అడ్రసు నందు అందజేయగలరు.
అడ్వకేట్: N.SANTOSH KUMAAR (M.A, M.A, LLB)
D NO. 9-29, MAIN ROAD, MADHURAWADA,
VISAKHAPATNAM. CELL 99080 77967.

శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం, విశాఖపట్నం జిల్లా.
RC.No: G2/18/2025, DT.17.02.2025 సెల్: 8008129195/8839566800
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం. శ్రీస్వామి వారి దేవస్థానమునకు 2025-2027 రెండు సంవత్సరముల కాలపరిమితికి అవసరమగు వివిధ రకములైన టిక్కెట్లను మరియు రిజిస్టర్లను మొదలగు వాటిని ప్రింటింగ్ చేసి సప్లయి చేయుటకు ఇ-ప్రొక్యూర్ మెంట్ ద్వారా టెండర్ పిలవబడుచున్నది. ఆసక్తి గల టెండరుదారులు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ షెడ్యూల్ కొరకు www.apeprocurement.gov.in (or) https://tender.apeprocurement.gov.in లో తేది. 19.02.2025 ఉదయం. 11.00గం॥ల నుండి తేది. 05.03.2025 మధ్యాహ్నం 3.00 గం.ల వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తేది. 5.03.2025 సాయంత్రం గం. 03.30లలోగా ఆన్‌లైన్ లో దాఖలు చేయవలెను. ఇతర వివరముల కొరకు కార్యాలయ పనివేళల యందు మరియు పై తెలిపిన ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చును.
సం/- వి.త్రినాథరావు, కార్యనిర్వహణాధికారి

దేవాలయాల స్వయం ప్రతిపత్తి, ఆర్థిక వ్యవస్థను కాపాడాలి

విశాలాంధ్ర-విశాఖపట్నం: టెంపుల్ కనెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ దేవాలయాల సమావేశం & ఎక్స్‌పో 2025 యొక్క రెండవ రోజు కార్యక్రమంలో తమిళనాడు లోని బిజెపి చీఫ్, కె.అన్నామలై ఆలయ ఆర్థిక వ్యవస్థ స్వయంప్రతిపత్తి గురించి ప్రసంగిం చారు. హిందూ రెలిజియస్ చారిటబుల్ ఎండోమెంట్స్ యాక్ట్స్ వంటి పాలక సంస్థలను రద్దు చేస్తూ, భారతదేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాల్సిన అవసరాన్ని, పెద్ద, స్వయంప్రతిపత్తి కలిగిన దేవాలయాల ఆర్థిక వ్యవస్థను అనుకరించాల్సిన అవసరాన్ని ఆయన వెల్లడించారు. తన ప్రసంగం ప్రారంభంలో, వివిధ తరాలకు చెందిన సనాతన ధర్మ అనుచరులను ఒకచోట చేర్చడానికి ఐటిసి ఎక్స్, టెంపుల్ కనెక్ట్ చేసిన ప్రయత్నాలను ప్రశంసించారు. గత సంవత్సరం వారణాసిలో జరిగిన టెంపుల్ కనెక్ట్ కార్యక్రమం, ఈ ఏడాది తిరుపతిలో జరిగిన టెంపుల్ కనెక్ట్ కార్యక్రమం మన స్వామీజీలను, మన ఆదివాసులను, మన గురువులను ఒక చోటకు తీసుకురాగలిగిందని అన్నారు.

జ్ఞాన జ్యోతి సమగ్ర శిక్ష కార్యక్రమం

విశాలాంధ్ర-అనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ జోగా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు అందులో భాగంగా అంగన్వాడి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడు తుందని అందుకు అనుగుణంగా సలహాలు సూచనలు చేసి, అందరూ సమిష్టి కృషితో బలోపేతం సాధించాలని ఈ సందర్భంగా తెలిపారు. మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల వరకు మధ్య పిల్లలకు బలమైన పునాదిని విద్యలో అందించినట్లయితే మంచి విద్యార్థులుగా ఎదుగుతారని అలాగే వారికి ఆరోగ్య సంరక్షణ కల్పించడం అమలాపరచడానికి అంగన్వాడి వర్కర్స్ మెరుగైన శిక్షణ ఇచ్చినట్లయితే వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు.12 రోజులు జ్ఞాన జ్యోతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో సీఎంఓ దేవుడుబాబు, ఎంఈఓ 1 జోగేంద్రనాథ్, ఎంఈఓ 2 గంగరాజు, డిఆర్పిఎస్ ఉమామహేశ్వరరావు, రాంబాబు, రఘు, రాముడు, రత్నం ,రేఖవాణి ,సీఆర్పీలు ఎస్ శివాజీ, డి గౌరీ శంకర్రావు,, బి శివాజీ ,వెంకట్రావు, దుర్గ ,తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ, ఐసిడిఎస్ సంయుక్త శిక్షణ

విశాలాంధ్ర-తగరపువలస : భీమునిపట్నం మండల కేంద్రంలో విద్యాశాఖ మరియు ఐసిడిఎస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి ఎఫ్ఎల్ఎన్ 120 రోజుల జ్ఞానజ్యోతి 6 రోజుల శిక్షణా కార్యక్రమం లో భాగంగా తొలి విడత తేదీ 18 నుండి 20 వరకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని భీమిలి ఐసిడిఎస్ డిపిఓ ఎం శ్రీదేవి, మండల విద్యాశాఖ అధికారిని ఎం. శివరాణి, జయప్రద ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి అంగన్వాడి కార్యకర్తలకు పిల్లలకు బోధించే విధానాలపై సర్టిఫికెట్ కోర్సును అందించడం జరుగుతుందని తెలయజేసారు. ఈ శిక్షణాను ఉపయోగించుకొని అంగన్వాడీ కార్యకర్తలు అంగన్వాడీ కేంద్రాల్లో పిపి1 పిపి2 విద్యార్థులకు విద్యాబోధన చేయవలసి ఉంటుంది. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎస్ఆర్పి లు కరుబుక్త సన్యాసినాయుడు ,బి హరిణి, డిఆర్పీలు, మండల విద్యాశాఖ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గొరపల్లిలో శ్రీ పరదేశి మాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి మండలం గొరపల్లి గ్రామంలో శ్రీ పరదేశమ్మ అమ్మవారి పండుగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. గొరపల్లి గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామానాయుడు గారు, అయితే సింహాచలం నాయుడు ,కోరుబిల్లి సుందర్ రావు, వడ్డాది కృష్ణ గారు, నేటిపల్లి మహేష్, డి బి ఎల్ నాయుడు స్థానిక నాయకులు గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన ఏపీసి, సీఎంఓ

విశాలాంధ్ర-పద్మనాభం: పద్మనాభం మండలం కేజీబీవీను మంగళవారం ఏపీసి డాక్టర్ జె చంద్రశేఖర్, సీఎంఓ డి దేవుడు బాబు సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి ఏ ఎల్ ల్యాబ్ నువ్వు పరిశీలించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి,ఇంటర్మీడియట్ విద్యార్థులతో పబ్లిక్ పరీక్షలు గురించి ఎలా రాయాలో చర్చించడం జరిగింది. పరీక్షలలో ఎలా రాయాలో తగు సూచనలు సలహాలు చేసినారు. అనంతరం తరగతి గదులను, వంటగదులను, కంప్యూటర్ ల్యాబ్ కోసం నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించడం జరిగినది. కేజీబీవీ నుండి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ గ్రేస్ లిల్లీ మరియు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న మల్లె తోటలు

జోరుగా సాగు చేస్తున్న రైతులు.....

డిసెంబర్ వరకు వర్షాలు పడుతున్న నేపథ్యంలో కొంతమేర ఆలస్యం.....

ఎరువులు మందులు ఉచితంగా అందించాలని రైతుల ప్రభుత్వానికి విజ్ఞప్తి

విశాలాంధ్ర-ఆనందపురం: జనవరి నెల నాటికి పువ్వుల తోటలు పూర్తిస్థాయిలో అన్ని విధాలుగా రైతులు తయారు చేసేవారు. కానీ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వలన కొంతమేర ఆలస్యం కనిపిస్తుంది. మల్లెపూల తోటలు పూర్తిస్థాయిలో అధిక దిగుబడితో విరబూయాలంటే డిసెంబర్ నాటికి పనులు చేపట్టాలి. అక్కడక్కడ అరకొరగా పనులు చేపట్టినప్పటికీ వర్షాలు వలన పూర్తిస్థాయి లో పూతలు రాలేదు. పువ్వుల్లోనే రారాజు మల్లె ప్రత్యేకమైనది. పూలలో మల్లెపువ్వు చాలా ముఖ్యమైనది. సువాసన కలిగి ఉండే మల్లెపువ్వును ఇష్టపడని వారుండరు. భారతదేశంలో వాణిజ్యపరంగా మల్లెపూల సాగును రైతులు చేపడుతున్నారు. స్త్రీల అలంకరణలో మల్లెపూలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. కష్టమైనా ఎంతో ఇష్టంగా చాలా మంది రైతులు మల్లె సాగును చేవడతారు. పూల దిగుబడి ఉండవచ్చని అంచనాగా విడిపూలుగా, దండలు, బొకేలు, తయారీకి వినియోగిస్తారు. శీతాకాలంలో చలితక్కువ, వేసవిలో వేడిమిగా, ఒక మోస్తరు వర్షపాతం, సూర్యరశ్మి బాగా ఉండే ప్రదేశాల్లో మల్లె సాగు రైతులు చేపడతారు. మొక్కల సాంద్రతను బట్టి దిగుబడి అధారపడి ఉంటుంది., నీరు సమృద్ధిగా లభించే నేలల్లో మల్లె సాగు చేపట్ట వచ్చు. మల్లె సిఫార్సు మోతాదులో ఎరువులు వేస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఒక్కో మొక్కకు 60గ్రా నత్రజని, 120 గ్రాముల భాస్వరం, 120 గ్రాముల పొటాష్ రసాయనిక ఎరువులను వేయడం ద్వారా ఎక్కువ చిగుళ్లు, పూలు పూసే శాఖలు ఏర్పడి పెద్ద మొగ్గలు పూస్తాయి. పూత దశలో 0.25శాతం మోతాదులో మెగ్నీషియం పిచికారి చేస్తే పూల దిగుబడి పెరుగుతుంది. ప్రతి మొక్కకు సరిపడినంత మేర పశువుల ఎరువును సమృద్ధిగా అందించాలి. వారానికి ఒకసారి నీటి తడులు అందిస్తారు, దానితోపాటు వారానికి నాలుగు సార్లు మందును స్ప్రే చేస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలావరకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వచ్చేది కూలీల వరకే సరిపోవడం ఇలాంటి సంఘటనల రైతులు తరచూ చూరైతన్నలు కోరేది ప్రభుత్వం తరుపునుండి ఉచితంగా కాకపోయినా కనీసం సబ్సిడీల రూపంలో మంచి నాణ్యమైన ఎరువులు మందులు తక్కువ ధరకు అందించినట్లయితే కొంతమేర భారం పడకుండా, ఉంటుందని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో ఎంపి సీఎం రమేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెందుర్తి : అనకాపల్లి ఎంపీ, రైల్వే శాఖ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ జన్మదిన వేడుకలు భారతీయ జనతా పార్టీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యాన పెందుర్తిలో మంగళవారం ఘనంగా జరిగాయి. బిజెపి నాయకులు, కార్యకర్తలు మహిళలతో కలిసి రామునాయుడు పులగాలి పాలెం కూడలిలో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో సీఎం రమేష్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ పేదలకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో సుమారు 200 మంది వృద్ధులు వికలాంగులకు పండ్లు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ సీఎం రమేష్ అనకాపల్లి ఎంపీగా గెలుపొందడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, ఆయన తన పరపతితో అనకాపల్లి జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా అనకాపల్లి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. సీఎం రమేష్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహించినట్లు తెలిపారు.